# చేపలే చేపలు

## స్వరాష్ట్రంలో పెరిగిన మత్స్య సంపద



తిరుమలగిరిలో విక్రయానికి తెచ్చిన చేపలు.

- మిషన్ కాకతీయ ఫలితంగా చెరువుల్లో పుష్కలంగా నీరు
- ఏటా ఉచితంగా చేప పిల్లలు విడుదల చేస్తున్న ప్రభుత్వం
- సబ్సిడీపై వాహనాలు, వలలు అందజేత
- సూర్యాపేట జిల్లాలో 578 చెరువుల్లో చేపల పెంపకం
- 15,847 మంది మత్స్యకారులకు ఉపాధి
- ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేసే స్థాయికి చేపల ఉత్పత్తి
- ఆర్థిక పురోభివృద్ధి సాధిస్తున్న మత్స్యకారులు

రాష్ట్ర ప్రభుత్వం కుల వృత్తులకు జీవం పోస్తూ వారి జీవితాల్లో వెలుగులు నింపుతున్నది. ఈ క్రమంలో మత్స్యకారులకు ఉపాధి కల్పించి ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ఉచితంగా చేప పిల్లలు పంపిణీ చేస్తున్నది. చేపలను అమ్ముకునేందుకు సబ్సిడీపై వాహనాలు, వలలు, ఇతర సామగ్రి అందించి అండగా ఉంటున్నది. చెరువులు, కుంటల్లో చేప పిల్లలను వదులుతుండడంతో మత్స్య సంపద గణనీయంగా పెరిగింది. దీంతో చేపలపై ఆధారపడి జీవనం సాగించేవారు స్థానికంగానే ఉపాధి పొందుతున్నారు. మత్స్యకారులు మంచి ఆదాయాన్ని పొందుతూ ఆర్థికంగా బలోపేతం అవుతున్నారు. సూర్యాపేట జిల్లాలో 578 చెరువుల్లో 243.81 లక్షల చేప పిల్లలు వేశారు. దీంతో ఏటా 520 మెట్రిక్ టన్నుల చేపల ఉత్పత్తి వస్తుండగా.. 15,847 మంది మత్స్య కారులు జీవనోపాధి పొందుతున్నారు.

– తిరుమలగిరి, నవంబర్ 5

### 8 విడుతల్లో చేప పిల్లల పంపిణీ

తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత మత్స్యకారులకు ఉపాధి కల్పించి ఆర్థికంగా బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం 2016లో ఉచిత చేప పిల్లల పంపిణీ పథకం ప్రవేశపెట్టింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు 8 విడుతల్లో చేప పిల్లలను పంపిణీ చేసింది. ఇందులో భాగంగా సూర్యాపేట జిల్లాలో 848 చెరువులు ఉండగా.. 578 చెరువుల్లో 243.81 లక్షల చేప పిల్లలను వదిలారు. దాంతో చేపల ఉత్పత్తి గణనీయంగా అవుతుండగా.. 140కి పైగా మత్స్య సహకార సంఘాల్లోని 15,847 మంది మత్స్య కార్మికులు జీవనోపాధి పొందుతున్నారు. అదేవిధంగా మత్స్యకారులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీమా సౌకర్యం కూడా కల్పించాయి. దీని ద్వారా 18 నుంచి 70 ఏండ్లలోపు కార్మికులు చేపలు పట్టడానికి వెళ్లి ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.5 లక్షలు, ప్రమాదానికి గురైతే రూ.25వేలు బీమా అందుతున్నది.

### ఇతర రాష్ట్రాలకు చేపల ఎగుమతి

రాష్ట్ర ప్రభుత్వం చెరువులు, కుంటల్లో చేప పిల్లలు వేయడంతో మత్స్య సంపద గణనీయంగా పెరిగింది. దాంతో జిల్లాలో ప్రతి సంవత్సరం 520 మెట్రిక్ టన్నుల ఉత్పత్తి జరుగుతుంది. మార్కెట్‌లో మన చేపలకు మంచి డిమాండ్ ఉండటంతో ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తూ మత్స్యకారులు మంచి లాభాలు గడిస్తున్నారు. ప్రధానంగా కొర్రమీను, రవ్వ, బంగారు తీగ, బురకలు మార్కెట్‌లో ఎక్కువగా లభిస్తున్నాయి.

### సబ్సిడీపై వాహనాలు..

మత్స్యకార్మికుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం అనే పథకాలు ప్రవేశపెట్టి ఆదుకుంటున్నది. ఇందులో భాగంగా చేపలను తరలించడానికి, ఇతర ప్రాంతాల్లో విక్రయించుకోవడానికి ఇబ్బందులు లేకుండా 70 శాతం సబ్సిడీతో ద్విచక్ర వాహనాలు, లగేజీ ఆటోలు, మినీ డీసీఎంలు అందజేసింది. అదేవిధంగా చేపల వేటకు అవసరమైన వలలు, ఇతర పరికరాలను సైతం అందిస్తున్నది.



తిరుమలగిరి మండలం వెలిశాల చెరువులో చేపలు పడుతున్న మత్స్యకారులు (ఫైల్)

### చేప పిల్లల కోసం ఆంధ్రాకు పోయే బాధ తప్పింది



గతంలో చేప పిల్లల కోసం ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలోని కాకినాడకు పోయేవాళ్లం. తెలంగాణ రాష్ట్రం వచ్చాక ముఖ్యమంత్రి కేసీఆర్ మాకు ప్రతి సంవత్సరం లక్షకుపైగా చేప పిల్లలు ఉచితంగా ఇస్తుండ్రు. దాంతో చేప పిల్లల కోసం ఆంధ్రాకు పోయే బాధ తప్పింది. మేము చేపలు అమ్ముకునేందుకు ఒక బొలేరో, ఒక టాటా ఏస్, 18 టీవీఎస్ ఎక్సెల్ ద్విచక్ర వాహనాలు వచ్చాయి. మేము పట్టిన చేపలు ఈ వాహనాలపై తిరిగి అమ్ముకుంటున్నాం. అన్ని ఖర్చులు పోను నెలకు రూ.20 వేల వరకు సంపాదిస్తున్నాం. మత్స్య సంపద పెరుగడంతో హైదరాబాద్ చేపల మార్కెట్‌కు కూడా ఎగుమతి చేస్తున్నాం. జీవనోపాధి పొందడంతోపాటు ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నాం. సంతోషంగా ఉన్నది.

– అంకిరెడ్డి లింగయ్య, మత్స్య సొసైటీ చైర్మన్, పర్సాయపల్లి, అర్వపల్లి మండలం

# నామినేషన్ దాఖలులో ఏమరుపాటు వద్దు

## అభ్యర్థులు ఎన్నికల నియమావళిని పాటించాలి

అఫిడవిట్‌లో ఆస్తులు, నేర చరిత్ర చెప్పాల్సిందే

పొరపాటు చేస్తే పదవికే ఎసరు

నేరేడుచర్ల, నవంబర్ 5 : అసెంబ్లీ ఎన్నికల్లో తొలి అంకమైన నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతున్నది. పోటీ చేస్తున్న అభ్యర్థులు నామినేషన్లు వేసేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. అయితే.. ఎన్నికల నియమావళిని తప్పనిసరిగా పాటించాలని, పొరపాటు చేస్తే ఇబ్బందులు పడాల్సి వస్తుందని న్యాయ నిపుణులు సూచిస్తున్నారు. నామినేషన్ పత్రాన్ని సరిగా నింపి ఎన్నికల రిటర్నింగ్ అధికారికి అప్పగించడం, విధి విధానాలను అనుసరించి వ్యవహరించడం, పలు అంశాలను తూ.చ. తప్పకుండా పాటించాల్సిన అవసరం ఉన్నది. ముఖ్యంగా ఎన్నికల అఫిడవిట్‌లో తమ ఆస్తులు, నేర చరిత్ర, కులం వంటి వివరాలను పక్కాగా నమోదు చేయాలి. ఇందులో ఏ మాత్రం పొరపాటు జరిగినా నామినేషన్ తిరస్కరణకు గురయ్యే అవకాశం ఉన్నది. అఫిడవిట్‌లో వివరాలు తప్పుగా నమోదు చేస్తే.. ఎన్నికల్లో విజయం సాధించినా ప్రత్యర్థులు కోర్టును ఆశ్రయిస్తే పదవిని కోల్పోయే ప్రమాదం ఉంటుంది. అందువల్ల నామినేషన్ పత్రాల్లో పూర్తి వివరాలను జాగ్రత్తగా నమోదు చేయాలని, నామినేషన్ వేసే సమయంలో నిర్దేశించిన నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ఎన్నికల అధికారులు సూచిస్తున్నారు.

### ఆస్తుల వివరాలు చెప్పాల్సిందే..

ఎన్నికల్లో పోటీ చేసే ఎమ్మెల్యే అభ్యర్థులు నామినేషన్ పత్రాల్లో తమకున్న ఆస్తుల వివరాలను విధిగా నమోదు చేయాలి. స్థిర, చర ఆస్తులతోపాటు ఆభరణాలు, వాహనాల వివరాలను నిర్ధిష్ట ప్రొ ఫార్మాలో పేర్కొన్నాలి. వారికున్న రుణాలు, అప్పులు, ఈ ఐదేండ్లలో జరిగిన ఆర్థిక లావాదేవీల వివరాలను అందించాలి.

### కులం, ఇతర వివరాలు తప్పనిసరి

రిజర్వ్‌డ్ నియోజకవర్గాల్లో పోటీ చేసే అభ్యర్థులు తప్పనిసరిగా తమ కులం వివరాలను అఫిడవిట్‌లో నమోదు చేయాలి. ఈసీ ప్రకటించిన రిజర్వేషన్ ప్రకారంగానే అభ్యర్థులు పోటీ చేయాల్సి ఉండడంతో ఆ కులం వివరాలతోపాటు రెవెన్యూ అధికారి జారీ చేసిన ధ్రువపత్రం జత చేయాలి. జనరల్ స్థానాల్లో పోటీ చేసే వారికి ఈ నిబంధన వర్తించదు.

### తప్పుడు సమాచారంతో తంటాలు

ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఈసీ నిబంధనల మేరకు నామినేషన్ పత్రాల అఫిడవిట్‌లో ఆస్తులు, కేసుల వివరాలను తప్పనిసరిగా నమోదు చేయాలి. ఈ వివరాలను ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లో ప్రజల ముందు ఉంచుతుంది. తప్పుడు సమాచారం నమోదు చేస్తే భవిష్యత్‌లో న్యాయపరంగా ఇబ్బంది పడాల్సి ఉంటుంది. ఎన్నికల అఫిడవిట్‌ను పూర్తిగా నమోదు చేయాలి. లేకుంటే తిరస్కరణకు గురయ్యే అవకాశం ఉన్నది. కాబట్టి అభ్యర్థులు జాగ్రత్తగా వ్యవహరించడం శ్రేయస్కరం.

### ఈ నిబంధనలు పాటించాలి..

- ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థి తప్పనిసరిగా నామినేషన్ దాఖలుకు కనీసం ఒక రోజు ముందు ప్రభుత్వ రంగ బ్యాంకు నుంచి కొత్తగా ఖాతా తెరిచి ఉంచుకోవాలి.
- అభ్యర్థి నాన్‌లోకల్ అయితే అతనికి ఎక్కడ ఓటు హక్కు ఉందో ఆ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి సదరు అభ్యర్థికి ఓటు ఉన్నట్లు ధ్రువీకరించి అటెస్టెడ్ చేయాల్సి ఉంటుంది.
- నాన్ లోకల్ అభ్యర్థిని ప్రతిపాదించే పౌరుడు మాత్రం పోటీ చేస్తున్న నియోజకవర్గానికి చెందిన వాడై ఉండాలి.
- అభ్యర్థి నామినేషన్ పత్రంతోపాటు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు 10 అందజేయాలి. నల్లద్దాలు, కూలింగ్ అద్దాలు ధరించి దిగిన ఫొటోలు చెల్లుబాటు కావు.
- అభ్యర్థి నామినేషన్ పత్రంతోపాటు ఫామ్–26ను రిటర్నింగ్ అధికారికి అంజేయాలి. నామినేషన్ దాఖలు చేసే రోజు ఫామ్ – 26 అందజేయకపోయినా ఆఖరు రోజు ఈ నెల 10న మధ్యాహ్నం 3 గంటల్లోపు తప్పనిసరిగా అందజేయాల్సి ఉంటుంది.
- అభ్యర్థిపై ఏదైనా పోలీస్ స్టేషన్‌లో క్రిమినల్, ఇతర కేసులు నమోదై ఉంటే వాటి వివరాలను తప్పనిసరిగా దిన పత్రికల్లో ప్రముఖంగా ప్రకటించాలి.
- గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ తరపున పోటీ చేస్తున్న అభ్యర్థి నామినేషన్ దాఖలు చివరి రోజు వరకు ఏ, బీ ఫామ్స్ అందించడం అనివార్యం.
- అభ్యర్థి ఎలక్షన్ ఏజెంట్, అడిషనల్ ఎలక్షన్ ఏజెంట్‌ను నియమించుకోవచ్చు.